సాక్షి జగిత్యాల

మంగళవారం । 19 । ఆగస్టు । 2025



శివాలయాల్లో శ్రావణ సందడి

ధర్మపురి: శ్రావణమాసం చివరి సోమవారం సందర్భంగా శివాలయాల్లో భక్తుల సందడి నెలకొంది. శ్రీరామలింగేశ్వర, అక్కపెల్లి రాజరాజేశ్వరస్వామికి భక్తులు మొక్కులు చెల్లించారు.



చెరుకు రైతుకు రవాణా భారం

జిల్లాలో ఏకైక ముత్యంపేట చెరుకు ఫ్యాక్టరీని ప్రారంభించాలని రైతులు ఏళ్ల తరబడి కోరుతున్నా.. పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదు.

8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
27.0/19.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల భారీవర్షం కురిసే అవకాశం ఉంది. ఈదురుగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

ఎస్సారెస్పీ 39 గేట్ల ఎత్తివేత



గోదావరిలోకి వదులుతున్న ఎస్సారెస్పీ నీరు

జగిత్యాలఅగ్రికల్చర్: శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి సోమవారం సాయంత్రం 39 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు ఎగువ ప్రాంతాల నుంచి 1,25,400 క్యూసెక్కుల వరద వస్తుండడంతో 2,26,867 క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు. వరదకాలువకు 18వేల క్యూసెక్కులు, కాకతీయ కాల్వకు 4700 క్యూసెక్కుల చొప్పున వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం 73.370 టీఎంసీలకు చేరింది.

బాగున్నారా సార్..



జీవన్‌రెడ్డితో కరచాలనం చేసిన సుంకె రవిశంకర్

మల్యాల: 'సార్ బాగున్నారా.. అంటూ మాజీమంత్రి జీవన్‌రెడ్డిని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పలుకరించారు. మండలంలోని ముత్యంపేటకు సంత లక్ష్మీ కుటుంబాన్ని పరామర్శించేందుకు సుంకె రవిశంకర్ వెళ్లారు. అదే సమయంలో మాజీమంత్రి జీవన్‌రెడ్డి లక్ష్మీ కుటుంబాన్ని పరామర్శించి వస్తున్నారు. ఇద్దరూ ఎదురుపడగా.. 'బాగున్నారా సార్..' అంటూ రవిశంకర్ జీవన్‌రెడ్డిని పలుకరించారు. కరచాలనం చేశారు. జీవన్‌రెడ్డి చిరునవ్వుతో అదేస్థాయిలో స్పందించారు. ఇద్దరు కలిసి మాట్లాడుకోవడం కాంగ్రెస్, బీఆర్‌ఎస్ కార్యకర్తల్లో చర్చనీయాంశమైంది.

భద్రత కోసమే గణేశ్ విగ్రహాలకు ఆన్‌లైన్

జగిత్యాలక్రైం: గణేశ్ మంటపాల వద్ద భద్రత కోసమే విగ్రహాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు కోరుతున్నామని ఎస్పీ అశోక్‌కుమార్ తెలిపారు. మంటపాల నిర్వాహకులు పోలీస్ రూపొందించిన http://policeportal.tspolice.gov.in/index.htm పోర్టల్‌లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మండపం సమాచారం కోసం మాత్రమే ఈ పోర్టల్ రూపొందించామని, బందోబస్తు చేయడం పోలీసులకు సులువుగా ఉంటుందన్నారు.

గోదావరి ఉధృతిని పరిశీలించిన అధికారులు




గోదావరిని పరిశీలిస్తున్న అధికారులు

ఇబ్రహీంపట్నం: ఎగువన కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీరాంసాగర్ నిండింది. దీంతో ప్రాజెక్టు గేట్లు ఎత్తి గోదావరిలోకి రెండుల లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఆ నీటి ప్రవాహాన్ని ఇబ్రహీంపట్నం మండలం కోమటికొండాపూర్, ఎర్దండి వద్ద తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో ఎండీ.సలీమ్, ఎస్సై అనిల్ పరిశీలించారు. భక్తులు, చేపలుపట్టేవారు, గొర్రెలకాపరులు గోదావరి వైపు వెళ్లకుండా చర్యలు చేపట్టారు. గోదావరి ప్రవాహం పెరిగితే తీరప్రాంతాల్లో ఉన్న ప్రజలను ఖాళీ చేయించి హైస్కూల్‌లో పునరావాసం కల్పించేందుకు వసతులు పరిశీలించారు. పంచాయతీ కార్యదర్శి మనోజ్, కారోబార్ రత్నం, తదితరులు ఉన్నారు.

జిల్లాలో 11.2 మి.మీ వర్షం

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో సోమవారం సగటున 11.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యధికంగా వెల్గటూర్‌లో 52.1 మి.మీ., అత్యల్పంగా మల్యాలలో 0.4 మి.మీ కురిసింది. ఇబ్రహీంపట్నంలో 9 మి.మీ., మల్లాపూర్‌లో 8.9, రాయికల్‌లో 7, బీర్‌పూర్‌లో 45.6, సారంగాపూర్‌లో 14, ధర్మపురిలో 7.9, బుగ్గారంలో 21, జగిత్యాల రూరల్‌లో 5.4, జగిత్యాలలో 5.3, మేడిపల్లిలో 3.5, కోరుట్లలో 3, మెట్‌పల్లిలో 1.9, కథలాపూర్‌లో 1.6, కొడిమ్యాలలో 1.5, గొల్లపల్లిలో 7.7, ఎండపల్లిలో 27.4, భీమారంలో 0.5 మిల్లీమీటర్ల చొప్పున వర్షం కురిసింది.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కల్వకోట విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

మేడిపల్లి: మండలంలోని కల్వకోట జెడ్పీ పాఠశాల విద్యార్థులు నోమన్, వసుధ అండర్‌-15 విభాగంలో జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచారు. వీరు ఈనెల 19న రంగారెడ్డి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రధానోపాధ్యాయుడు గంగాధర్ తెలిపారు. విద్యార్థులను పీఈటీ సాగర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

ఎక్కడుంటారో.. ఏం చేస్తారో..?

- వార్డు ఆఫీసర్లు ఉన్నట్లా..? లేనట్లా..?
- ఎనిమిది నెలల క్రితం నియామకం
- బల్దియా కార్యాలయంలో చోటు కరువు
- రూ.5లక్షలతో టెండర్లకు ఆహ్వానం
- అయినప్పటికీ మొదలుకాని పనులు



జగిత్యాల మున్సిపాలిటీ కార్యాలయం

జగిత్యాల: మున్సిపాలిటీల్లోని ప్రతి వార్డులో పౌర సేవలు పక్కాగా అందించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఇటీవల వార్డు ఆఫీసర్లను నియమించింది. వీరు ప్రతిరోజు మున్సిపల్ కార్మికులతో సమావేశం కావడం.. పనులను పర్యవేక్షించడం.. నివేదికను ఉన్నతాధికారులకు చేరవేయడం వంటి పనులు చేయాల్సి ఉంటుంది. అలాగే వార్డుస్థాయి పారిశుద్ధ్య ప్రణాళిక అమలు, ఇంటింటికీ చెత్త సేకరణ, వ్యర్థాల ప్రాసెస్, ప్రభుత్వ, ప్రైవేటు మార్కెట్లు, మటన్, చికెన్ స్టాల్స్ పరిశీలించాల్సి ఉంటుంది. అయితే వీరు విధుల్లో చేరి దాదాపు ఎనిమిది నెలలు గడుస్తున్నా.. ఈ వార్డు ఆఫీసర్లు ఉంటారన్న విషయం కూడా ఎవరికీ తెలియకుండా ఉంది. జిల్లాకేంద్రమైన జగిత్యాల బల్దియాలో 48వార్డులు ఉన్నాయి. ఇక్కడకు కొత్తగా 31 మంది వార్డు ఆఫీసర్లు వచ్చారు. గతంలో వీఆర్వోలుగా ఉన్న వారిలో కొందరిని వార్డు ఆఫీసర్లుగా నియమించారు. వారు విధుల్లో కూడా పాల్గొంటున్నారు. అయితే వార్డులో వార్డు ఆఫీసర్ ఉన్నారని, ముఖ్యమైన పనులు వారు చూసుకుంటారన్న అవగాహన మాత్రం ప్రజల్లో లేకుండా పోయింది. ప్రజలు కార్యాలయానికి వచ్చి సంప్రదిస్తే.. వారు ఎక్కడుంటారో..? ఏం చేస్తారో..? కూడా తెలియడం లేదు. కనీసం మొబైల్ నంబర్ కూడా అందుబాటులో ఉండడంలేదంటే అతిశయోక్తికాదు.

చోటు కరువు..

జగిత్యాల మున్సిపాలిటీలో ఇప్పటివరకు వార్డు ఆఫీసర్లకు చోటు కల్పించలేదు. ఇటీవల మున్సిపల్ కార్యాలయం పక్కనున్న కాంప్లెక్స్‌లో వీరికి ఆఫీసు ఏర్పాటు చేయాలన్న ఉద్దేశంతో రూ.5 లక్షలతో టెండర్లను ఆహ్వానించారు. అందులో ఫర్నీచర్‌తోపాటు రెనోవేషన్ చేయాల్సి ఉంటుంది. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఇప్పటివరకు పనులు మొదలుపెట్టలేదు. ఫలితంగా వార్డు ఆఫీసర్లకు చోటు కరువైంది. కార్యాలయానికి ఎవరు ఎప్పుడు వచ్చి వెళ్తున్నారో తెలియని పరిస్థితి నెలకొంది.

వారిదే కీలకపాత్ర

ప్రస్తుతం మున్సిపాలిటీల్లో వార్డు ఆఫీసర్లే కీలక పాత్ర పోషించాల్సి ఉంటుంది. పారిశుద్ధ్య ప్రణాళిక అమలు, ఇంటింటా చెత్త సేకరణ, వ్యర్థాలను వేరు చేయడం, మురికికాలువలు, ప్రజామరుగుదొడ్లను శుభ్రం చేయించేలా చూడాలి. ప్లాస్టిక్ నిషేధాన్ని సమర్థవంతంగా అమలు చేయాల్సి ఉంటుంది. ఇవి జిల్లాలో మచ్చుకైనా కనిపించడం లేదు. నీటి సరఫరా, వీధి దీపాల పర్యవేక్షణ, పెన్షన్లు, ఇతర సంక్షేమ పథకాలు, పట్టణ పేదరిక నిర్మూలన వంటి కార్యక్రమాలను చూడాల్సి ఉంటుంది. ఇంటి పన్ను, ఫీజులు, చార్జీలు అంచనా వేస్తూ జాబితాలు రూపొందించాల్సి ఉంటుంది. ఇన్ని బాధ్యతలు ఉన్నప్పటికీ వీరికంటూ ఓ కార్యాలయం లేకపోవడంతో సమస్యగా మారింది. రోజువారి కార్యక్రమాలను పర్యవేక్షించే వీరికి ఓ ఆఫీస్ కేటాయిస్తే బాగుంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. సెల్‌ఫోన్ నంబరు ఇస్తే ప్రజలు ఏమైనా సమస్యలుంటే చెప్పుకునే అవకాశం ఉంటుందంటున్నారు.

కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు

జగిత్యాల బల్దియాలో 48 వార్డులు ఉన్నాయి. వివిధ సమస్యలపై ప్రజలు కార్యాలయానికి వస్తుంటారు. ఏ వార్డు అని అధికారులు తెలుసుకుని సదరు వార్డు ఆఫీసర్‌ను కలవాలని సూచిస్తున్నారు. కానీ.. వారు ఎక్కడుంటారో మాత్రం చెప్పడం లేదు. ఇది ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. కార్యాలయంలో వారికంటూ ఓ గది కేటాయించి బోర్డు ఏర్పాటుతోపాటు సెల్‌నంబర్ ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. కొంతమంది సిబ్బంది రాకపోకలు సాగిస్తూ సకాలంలో కార్యాలయానికి రావడం లేదనే ఆరోపణలున్నాయి.

ప్రజాప్రతినిధులు చొరవ చూపాలి

ఇప్పటికే మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారడంతోపాటు, ఎక్కడా డ్రైనేజీలుగానీ, నాలాలుగానీ శుభ్రంగా లేవనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వార్డు ఆఫీసర్లు కీలకంగా వ్యవహరిస్తే పారిశుద్ధ్యం కొంత మెరుగు పడే అవకాశం ఉంది. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని పారిశుద్ధ్యం మెరుగుపర్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గతంలో కౌన్సిలర్లు ఉండటంతో ప్రజలు ఏ సమస్యనైనా ఉంటే వారి దృష్టికి తీసుకెళ్లేవారు. ప్రస్తుతం పాలకవర్గం లేకపోవడం, స్పెషల్ ఆఫీసర్ పాలన ఉండటంతో ఈ వార్డు ఆఫీసర్లే వారికి కీలకంగా మారారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారికంటూ ఓ చోటు ఏర్పాటు చేసి ప్రజల్లో ప్రతి వార్డుకు ఒక వార్డు ఆఫీసర్ ఉంటారన్న అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

టెండర్లు పూర్తయ్యాయి

వార్డు ఆఫీసర్లకు మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు టెండర్లు వేయడం జరిగింది. రూ.5 లక్షలతో ఫర్నీచర్‌తో పాటు రెనోవేషన్ చేయాల్సి ఉంటుంది. టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్‌తో పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకుంటున్నాం.

– చరణ్, ఏఈ

అభివృద్ధి, సంక్షేమానికి సమ ప్రాధాన్యం



చింతకుంటలో అదనపు తరగతి గదులను ప్రారంభిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

కథలాపూర్: ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యతనిస్తోందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తెలిపారు. మండలంలోని భూషణరావుపేటలో 41 మందికి రూ.15.70 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. చింతకుంట జెడ్పీ హైస్కూల్‌లో రూ.20లక్షలతో నిర్మించిన రెండు అదనపు తరగతి గదులను ప్రారంభించారు. రాళ్లవాగు ప్రాజెక్టును గత ప్రభుత్వం పట్టించుకోకుంటే తాము పూర్తి చేయిస్తున్నామన్నారు. డీఈవో రాము, ఏఎంసీ చైర్మన్ నారాయణరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, చెదలు సత్యనారాయణ, వాకిటి రాజారెడ్డి, గడ్డం చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్జీటీలకు పదోన్నతులు ఇవ్వాలి

బీఎడ్ అర్హత ఉన్న ఎస్జీటీలకు ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా పదోన్నతి కల్పించాలని వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. వీరిలో మామిడిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారావు, అల్లె పరమేశ్వర్, బద్రకంటి వేణుగోపాల్, విష్ణు, అరుణ, రాజకళ ఉన్నారు.

రైతులకు ఇబ్బంది కలిగించొద్దు

- మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అదనపు కలెక్టర్

జగిత్యాల: వానాకాలం పంటలకు అవసరమైన యూరియా రైతులకు చేరేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. సోమవారం హైదరాబాద్ నుంచి వీడియోకాన్ఫరెన్స్‌లో కలెక్టర్లతో మాట్లాడారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లత పాల్గొన్నారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా చూస్తున్నామని వివరించారు.

సమయపాలన తప్పనిసరి



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

ధర్మపురి: మండలంలోని నేరెళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ సందర్శించారు. రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. వర్షాలు కురుస్తున్నందున సిబ్బంది సమయపాలన పాటించాలని, ప్రజలకు అవసరమైన మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఇంటింటా తిరుగుతూ జ్వరాలతో బాధపడుతున్న వారి వివరాలు నమోదు చేయాలని పేర్కొన్నారు. సీహెచ్‌వో శ్రీనివాస్, సూపర్‌వైజర్లు వెంకట్, సులోచన, శోభన్‌బాబు తదితరులున్నారు.

హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయవాదులు



హైకోర్టు జడ్జిని కలిసిన న్యాయవాదులు

జగిత్యాలజోన్: హైకోర్టు జడ్జి, జిల్లా పోర్టుపోలియో జడ్జి వై.రేణుకను సోమవారం జగిత్యాల బార్ అసోసియేషన్ న్యాయవాదులు కలిశారు. జిల్లాలో ఫ్యామిలీ కోర్టు ఏర్పాటు, క్యాంటీన్‌కు శంకుస్థాపన, ఎస్సీ, ఎస్టీ కోర్టు ఏర్పాటు, రెండో అదనపు జ్యూడిషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో జడ్జి నియామకం, వివిధ కోర్టుల్లో సరిపడా సిబ్బంది నియామకం వంటి సమస్యలపై రేణుకకు వినతిపత్రం అందించారు. అనంతరం జిల్లాకు చెందిన హైకోర్టు అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు కాసుగంటి లక్ష్మణ్‌కుమార్, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రాచకొండ శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి అందె మారుతి, ఉపాధ్యక్షుడు సిరిపురం మహేంద్రనాథ్ పాల్గొన్నారు.

వర్షానికి కూలిన రెండిళ్లు

- నలుగురికి తప్పిన ప్రాణాపాయం



ప్రమాదం నుంచి బయటపడ్డ కుటుంబం

కోరుట్ల: 'వేకువజాము.. సుమారు నాలుగవుతోంది. ఒక్కసారిగా డబ్‌మని చప్పుడు వచ్చింది. లేచి చూస్తే చిమ్మ చీకటి.. సెల్‌ఫోన్ లైట్‌తో చూస్తే పైకప్పు రేకులు కిందికి వంగి ఉన్నాయి. పక్కింటి గోడ కూలి మాఇంటి గోడపై పడింది. మా ఇంటి గోడ కూలి బెడ్‌పక్కనే పడింది. వంగిన రేకులు, పడిపోయిన గోడ శిథిలాలను తప్పించుకుని నా భార్య, ఇద్దరు చిన్నపిల్లలం బయటపడ్డాం..' అని కన్నీళ్లు పెట్టుకున్నారు..కోరుట్ల కాల్వగడ్డ సమీపంలోని బెండపల్లికి చెందిన లతీఫ్, ఫిరోజ్ కుటుంబసభ్యులు.

కూలిపోయిన రెండిళ్లు

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు కాల్వగడ్డ సమీపంలోని లతీఫ్‌కు చెందిన ఇంటి మట్టిగోడ కూలింది. అది పక్కనే ఉన్న అమీరొద్దీన్, ఫిరోజ్ ఇంటి గోడపై పడింది. ఫిరోజ్ ఇంటి గోడ కూలి బెడ్‌రూంలో పడిపోయింది. ఆ సమయంలో రూమ్‌లో ఫిరోజ్ భార్య, ఆరేళ్ల కుమారుడు, ఆర్నెళ్ల కూతురు నిద్రిస్తున్నారు. గోడ కూలిన వెంటనే బెడ్‌రూంపైకి వంగిన రేకులు, కూలిన శిథిలాలను తొలగించి నలుగురు ప్రాణాలతో బయటపడ్డారు. లతీఫ్, ఫిరోజ్ ఇంటికి ఆనుకుని ఉన్న అమీరొద్దీన్ ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.

జువ్వాడి ఆర్థిక సహాయం

భారీ వర్షాలకు ఇళ్లు కోల్పోయిన బాధితులకు ప్రభుత్వపరంగా రూ.1.20లక్షల చొప్పున సాయం అందిస్తామని కాంగ్రెస్ కోరుట్ల ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు తెలిపారు. కూలిపోయిన ఇళ్లను పరిశీలించారు. తక్షణ సాయం కింద బాధితులకు రూ.5 వేలు అందించారు. కలెక్టర్‌తో మాట్లాడి బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయిస్తామన్నారు. ఈ మేరకు చర్యలు తీసుకోవాలని ఆర్డీవో జివాకర్‌రెడ్డి, తహసీల్దార్ కృష్ణచైతన్యకు సూచించారు. బాధితులకు పునరావాసం కల్పించాలని మున్సిపల్ కమిషనర్ రవీందర్‌కు తెలిపారు. ఆయనవెంట కాంగ్రెస్ నాయకులు అన్నం అనిల్, తిరుమల గంగాధర్, పుప్పాల ప్రభాకర్, ఫసియొద్దీన్, భూంరెడ్డి ఉన్నారు.

ఆలకించండి.. పరిష్కరించండి

- ప్రజావాణికి తరలివచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్ లత
- పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు



అర్జీలు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ లత

జగిత్యాలటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి జిల్లావ్యాప్తంగా బాధితులు తరలివచ్చారు. వారి నుంచి అదనపు కలెక్టర్ బీఎస్.లత అర్జీలు స్వీకరించారు. ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవోలు పులి మధుసూదన్, శ్రీనివాస్, డీఆర్‌డీవో రఘువరణ్ పాల్గొన్నారు.

పట్టాలిచ్చి ఆదుకోండి



మాది వెల్గటూర్ మండలం చెగ్యాం. గ్రామ శివారులోని సర్వే నంబర్ 289, 341, 344లోని 54.23 ఎకరాల భూమిని 175మందిమి 15ళ్లుగా కాస్తు చేసుకుంటున్నాం. ఆ భూమికి పట్టా ఇప్పించాలని అర్జీ పెట్టుకున్నాం. అప్పటి కలెక్టర్ ఆదేశాల మేరకు సర్వే పూర్తిచేసిన తహసీల్దార్ పెండింగ్‌లో పెట్టారు. సర్వే నివేదిక ప్రకారం ఆ భూమికి అసైన్డ్ పట్టాలు ఇప్పించి ఆదుకోండి. – చెగ్యాం గ్రామస్తులు, వెల్గటూర్

సెల్‌టవర్ నిలిపేయండి



మాకు ఎలాంటి సమాచార ఇవ్వకుండా జనావాసాల మధ్య సెల్ టవర్ నిర్మిస్తున్నారు. రేడియషన్‌తో అనారోగ్య సమస్యల బారిన పడే అవకాశం ఉంది. టవర్ నిర్మాణం ఆపాలని పలుసార్లు ఫిర్యాదు చేసినా చర్యలు చేపట్టలేదు. టవర్‌తోపాటు టైర్ గ్రూపింగ్ పరిశ్రమను జనావాసాల దూరంగా తరలించండి.

– భాగ్యనగర్ కాలనీవాసులు

ప్రమాదాలు అరికట్టండి



జిల్లాకేంద్రంలో వాహనాల రద్దీ తగ్గించే లక్ష్యంతో నిర్మించిన రాజీవ్‌బైపాస్ నిర్వహణ సరిగా లేక తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. డివైడర్ల మధ్య నాటిన చెట్లు రోడ్డుపై లైటింగ్ పడనీయడం లేదు. రాత్రిపూట ప్రమాదాలు జరుగుతున్నాయి. బైపాస్ రోడ్డులో అతివేగంగా వెళ్తున్న వాహనాలతో స్థానికులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

– ఎస్.రమణాచారి, జగిత్యాల

డ్రైనేజీలు శుభ్రం చేయించాలి



బీర్‌పూర్‌లో పారిశుధ్య పనులు క్రమపద్ధతిలో జరగడం లేదు. డ్రైనేజీలు శుభ్రం చేయడం లేదు. చేద బావుల్లో క్లోరినేషన్ చేయడం లేదు. దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టకపోవడంతో ప్రజలు వైరల్ ఫీవర్ల బారిన పడుతున్నారు. పారిశుద్ధ్య నిర్వహణ క్రమం తప్పకుండా జరిగేలా చూడండి.

– బైరమేని సత్యనారాయణ, బీర్‌పూర్

ధరణిలో నమోదు చేయించండి



మాది జగిత్యాల. మల్యాల మండలం ముత్యంపేటలో సర్వే నంబర్ 438/బిలో నా భార్య సిరిపురం విజయలక్ష్మి పేరిట 13 గుంటల భూమిని దస్తావేజు నంబర్47/2005లో కొన్నాను. రెవెన్యూ అధికారులు పాస్ బుక్ నంబర్ 350037 ద్వారా పట్టానంబర్ 746 జారీ చేశారు. 2018వరకు 1బీలో సదరు భూమి నా భార్య విజయలక్ష్మి పేరిటే ఉంది. ధరణి పోర్టల్‌లో రెవెన్యూ అధికారులు మా పేరు నమోదు చేయలేదు. అది ఎక్సెస్ ల్యాండ్‌గా చూపారు. పలుమార్లు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదు.

– సిరిపురం అంజయ్య. జగిత్యాల

పోరాటయోధుడు పాపన్న గౌడ్



పాపన్న విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సంజయ్

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలటౌన్: సామాజిక న్యాయం కోసం అలుపెరగని పోరాటం చేసిన సర్వాయి పాపన్న మహోన్నత వీరుడని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ కొనియాడారు. పాపన్న 375వ జయంతి సందర్భంగా సోమవారం జిల్లాకేంద్రంలోని గొల్లపల్లి చౌరస్తా వద్ద గల విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పాపన్న ఔన్నత్యాన్ని చాటేలా గొల్లపల్లి బైపాస్‌చౌరస్తాకు సర్వాయి పాపన్న కూడలిగా నామకరణం చేశామన్నారు. గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, గోపా జిల్లా అధ్యక్షుడు దుగ్గపు రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

పోరాట యోధుడు పాపన్న

వీరోచిత పోరాటానికి, సమానత్వానికి ప్రతీక పాపన్న అని జిల్లా అదనపు కలెక్టర్ లత అన్నారు. కలెక్టరేట్‌లో పాపన్న జయంతిని అధికారికంగా నిర్వహించారు. ఆర్డీవో మధుసూదన్‌గౌడ్, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారులు సునీత, రాజ్‌కుమార్, మెప్మా పీడీ దుగ్గపు శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు అండగా ఉంటా

హమాలీ కార్మికులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. జిల్లాకేంద్రంలో నిర్వహించిన హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూలీలు లేబర్ కార్డు తీసుకోవాలన్నారు. జాబితాపూర్‌లో భారీ గోదాం నిర్మిస్తామని, తద్వారా హమాలీలకు ఉపాధి పెరుగుతుందన్నారు. హమాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సామ్రాజ్యం, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొమురయ్య పాల్గొన్నారు.

టెక్నికల్ సెంటర్‌తో ఉపాధి

జగిత్యాల: అడ్వాన్స్‌డ్ టెక్నికల్ సెంటర్‌తో ఉపాధి అవకాశాలుంటాయని ఎమ్మెల్యే అన్నారు. టెక్నికల్ సెంటర్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏటీసీలో ఫస్ట్, సెకండ్ ఫేస్‌లో మిగిలిన సీట్లలో విద్యార్థులు నేరుగా చేరవచ్చన్నారు.

క్లుప్తంగా

ఇంట్లో జారిపడి వ్యక్తి మృతి


మహ్మద్ అతిక్ (ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని గంజ్‌రోడ్ ప్రాంతానికి చెందిన మహ్మద్ అతిక్ (38) తన ఇంట్లో ప్రమాదవశాత్తు కాలుజారి పడి మృతిచెందాడు. అతిక్ ఆదివారం సాయంత్రం తన ఇంట్లో కాలుజారి పడగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు చికిత్స అందించినా ఫలితం లేకుండాపోయింది. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విషజ్వరంతో పారిశుధ్య కార్మికుడు..


స్వామి (ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని గాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో పని చేస్తు న్న జుట్టు స్వామి విషజ్వ రంతో సోమవారం మృతిచెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. స్వామి వారంరోజులు కరీంనగర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్సపొందాడు. అయినా జ్వరం తగ్గలేదని తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం వెల్దుర్తి గ్రామానికి చెందిన బందెల రాజశేఖర్ (35) అనే వ్యక్తి ఒంటరితనం భరించలేక మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెల్దుర్తి గ్రామానికి చెందిన బందెల రాజశేఖర్ భార్య మూడు నెలల క్రితం అనారోగ్యంతో మరణించింది. అప్పటి నుంచి రాజశేఖర్ ఒంటరితనంతో బాధపడుతూ తీవ్ర ఆందోళనలో ఉన్నాడు. ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తల్లి బందెల గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు.

రెండు ఆలయాల్లో చోరీ

వీణవంక: మండలంలోని కోర్కల్ గ్రామంలో ఆదివారం రాత్రి రెండు ఆలయాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. గ్రామ శివారులోని రేణుక ఎల్లమ్మ ,పెద్దమ్మ తల్లి ఆలయాల్లో రెండున్నర తులాల బంగారం, 59తులాల వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లారు. క్లూస్ టీం రంగంలోకి దిగి ఆధారాలు సేకరించారు. గ్రామస్తుడు పూదరి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

ట్యాక్సీడ్రైవర్‌కు రెండేళ్ల జైలు

జగిత్యాలజోన్: సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ.. వాహనాన్ని అజాగ్రత్తగా.. నిర్లక్ష్యంగా నడిపి ఒకరి మృతికి కారణమైన ట్యాక్సీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు శిక్షతోపాటు రూ.3వేల జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.రత్నపద్మావతి సోమవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ జంగిలి మల్లికార్జున్ కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలం తిమ్మాపూర్‌కు చెందిన 12 మంది మహిళలు రాయికల్ మండలం కుమ్మరిపల్లిలో జరిగిన ఓ శుభ కార్యానికి ఓ మినీటాక్సీలో వెళ్లారు. మోరపల్లి శివారులో డ్రైవర్ పరాంకుశంవంశీకృష్ణ సెల్‌ఫోన్ మాట్లాడుతూ.. వాహనాన్ని అజాగ్రత్తగా నడిపి రోడ్డుపక్కనున్న కల్వర్టును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో ఆటోలో ఉన్న తోట్ల గంగవ్వ అక్కడికక్కడే చనిపోయింది. మిగతావారు గాయపడ్డారు. దీనిపై బాధితురాలు రాధ ఫిర్యాదు మేరకు అప్పటి జగిత్యాల రూరల్ ఎస్సై చిరంజీవి కేసు నమోదు చేశారు. సీఐ కృష్ణకుమార్ దర్యాప్తు చేసి కోర్టులో చార్జీషీట్ దాఖలు చేసారు. కోర్టు మానిటరింగ్ అధికారులు ఎం.కిరణ్‌కుమార్, కె. నరేశ్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో వంశీకృష్ణకు రెండేళ్ల జైలు, జరిమానా విధించారు.




చిత్రం..



జ్ఞాపకాల పత్రం

- చరితకు చెరిగిపోని సాక్ష్యం
- నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం

విద్యానగర్(కరీంనగర్)/సిరిసిల్ల: ఫొటో.. చెదిరిపోని జ్ఞాపకం. గతించిన కాలాన్ని కళ్ల ముందుంచే సాక్ష్యం. మదిలో మెదిలే భావాలను కళ్ల ముందు నిలిపే ఛాయాచిత్రం. ఫొటోగ్రఫీకి సృజనాత్మకత తోడైతే అద్భుత చిత్రాలు కళ్లముందుంటాయి. మదిని పులకింపజేసి.. మనసును తట్టిలేపి.. మధురమైన అనుభూతులను పదిలం చేసేది ఫొటో. ప్రపంచ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఫొటోగ్రఫీలో వస్తున్న మార్పులు.. జిల్లా వాసుల ప్రతిభపై ప్రత్యేక కథనం.



కరీంనగర్‌లో తొలి ఫొటో స్టూడియోలు

1961 ప్రాంతంలో కరీంనగర్‌లో ఫొటో స్టూడియోలు ఏర్పాటయ్యాయి. కరీంనగర్‌లోని క్లాక్‌టవర్ వద్ద ఏవీఎం ఫొటో స్టూడియో, తిలక్‌రోడ్‌లో అజంతా ఫొటో స్టూడియోను ప్రారంభించారు. కరీంనగర్‌కు చెందిన ఏలేటి వేణుమాధర్‌రెడ్డి 1961 జనవరి 1న ఆయన పేరుతో ఏవీఎం స్టూడియో ప్రారంభించారు. మూడేళ్ల తర్వాత గురుదత్త నిర్మాత సారథ్యంలో ముంబైలో రూపొందిన మొదటి స్కోప్ సినిమాకు అసిస్టెంట్ కెమెరామెన్‌గా పనిచేశారు. బ్లాక్ అండ్ వైట్ మాన్యువల్ నుంచి 35 ఎంఎం మినియేచర్ ఫిలిం, కలర్ ప్రాసెసింగ్ కంప్యూటర్ వరకు కొనసాగారు. ఆయన వాడిన 1945 నాటి రోలిఫ్లెక్స్, ఎగ్జాక్ట, మన్య, కేబినేట్, ఫుల్‌సైజ్‌ల నెగెటివ్‌ల బాడీ కెమెరాలు ఇప్పటికి వాళ్ల ఇంట్లో భద్రంగా ఉన్నాయి. ఆయన నలుగురు కొడుకులు ఈ రంగంలోనే రాణిస్తున్నారు.

➡ ఫొటోగ్రఫీ డే గురించి

ఫ్రెంచ్ దేశస్తుడైన డాగురే 1839లో మొదటిసారి ఫొటోగ్రాఫిక్ ప్రాసెస్ కనిపెట్టి అదే సంవత్సరం ఆగష్టు 19న ప్రపంచానికి పరిచయం చేశాడు. సిల్వర్ అయొడైడ్ రసాయనంతో చిత్రానికి శాశ్వతత్వం కల్పించవచ్చని ప్రతిపాదించాడు. 1842 నుంచి 1880 మధ్య కాలంలో ఇండియలో ఫొటోగ్రఫీ పరిశ్రమ విస్తరించింది. ఆంధ్రప్రదేశ్‌లో మొదటి పోర్ట్‌రయిట్ స్టూడియోను దీన్ దయాళ్ కెన్నడీ అనే మహిళ స్థాపించింది. 1960 నాటికి స్టూడియో ఫొటోగ్రఫీ, 1980 నాటికి కంప్యూటర్‌తో కలర్ ఫొటోగ్రఫీ విస్తరించింది. రాజా త్రయంబక్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో మొదటి సారి 1957లో ఫొటోగ్రఫీ సొసైటీ ప్రారంభమైంది.

➡ ఉమ్మడి జిల్లా ప్రస్థానం

1940లో ఉమ్మడి జిల్లా కేంద్రం కరీంనగర్‌లో మొదటి ఫొటోస్టూడియో నెలకొల్పారు. ప్రతిష్టాత్మక ఫెలోషిప్ ఆఫ్ రాయల్ ఫొటోగ్రఫీ సొసైటీ (ఇంగ్లాండ్) సాధించిన ఉమ్మడి రాష్ట్రంలోనే ఏకైక వ్యక్తి కోరుట్లకు చెందిన ఫొటోగ్రాఫర్ బండి రాజన్‌బాబు. 1987లో నగ్న చిత్రాలపై థీసిస్ సమర్పించి రాయల్ ఫొటోగ్రఫీ సొసైటీ ఫెలోషిప్ పొందారు. జగిత్యాలకు చెందిన అల్లె శ్రీకాంత్, కోరుట్లకు చెందిన బండి వెంకటరమణ, కరీంనగర్‌కు చెందిన బాబురెడ్డి, వేణు, రాజు, సంపత్‌కుమార్, వాసు, గంగాధర్, సదానందం, ఆత్మారాం, వేములవాడకు చెందిన రాజయ్య, జగిత్యాలకు చెందిన రామ్మోహన్, సతీష్, సిరిసిల్లలో ఎం.సి. శేఖర్, బోడ రవీందర్, కోడం దేవేందర్, వంకాయల శ్రీకాంత్, కోరుట్లకు చెందిన నాగరాజు, రాజేశం, శేఖర్, మహేందర్, మారుతి, మెట్‌పల్లి రాము, మల్యాల శ్రీనులు, ఎల్లారెడ్డిపేటకు చెందిన ప్రభాకర్‌రెడ్డి, సిరిసిల్లకు చెందిన శంకర్ మరెందరో ఫొటోగ్రఫీలో సృజనాత్మకతను జోడించి రాష్ట్ర స్థాయి అవార్డులు పొందారు.

➡ ప్రీ వెడ్డింగ్ ఫొటోగ్రఫీ

ఏ ఫంక్షన్ జరిగిన, ఎక్కడికి వెళ్లిన సెల్‌ఫోన్లతోనే ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలోనే ప్రీ వెడ్డింగ్ ఫొటోగ్రఫీపై కొత్తగా జంటలు ఉత్సాహం చూపిస్తున్నారు. దేశవ్యాప్తంగా తమకు అనువైన ప్రాంతాలను ఎంపిక చేసుకుని ప్రీ వెడ్డింగ్ ఫొటోలతోపాటు పెళ్లి వేడుకలను ఫొటోగ్రాఫర్లతో తీయించుకుంటున్నారు.

రీళ్ల నుంచి డిజిటల్



నాడు రీళ్లతో ఫొటోలు తీసేవాళ్లం, సాంకేతిక ప్రగతిలో నేడు డిజిటల్ కెమెరాలు అందుబాటులోకి వచ్చాయి. సెల్‌ఫోన్ కెమెరాలు, ఇంటింటికీ కెమెరాలు వచ్చినప్పటికీ ఫొటో స్టూడియోలకు ఆదరణ తగ్గలేదు. రీళ్ల పద్ధతి పోయి, డిజిటల్ కెమెరాలు, ప్రింటింగ్ యంత్రాలు ప్రవేశించడంతో ఈ ప్రక్రియ పూర్తిగా సులభతరమైంది. **– ఆవుల నరేశ్, ఫొటోగ్రాఫర్, జ్యోతినగర్, కరీంనగర్**

ఎన్నో మార్పులు



మా చిన్నప్పుడు ఫొటో అంటే ఓ క్రేజ్. ఏదైనా ఫంక్షన్ జరిగితే ఫొటోగ్రాఫర్ వచ్చి ఫొటోలు తీయడం, స్టూడియోకి వెళ్లి ఫొటోలు దిగడం చాలా కొత్తగా అనిపించేది. ఇప్పుడు సెల్‌ఫోన్‌లో అన్ని ఫంక్షన్‌లు, అన్ని సందర్భాల్లో ఫొటోలు తీసుకోవడం, మెమొరీ కార్డుల్లో భద్రపరచుకుంటున్నాం. **– పల్లెర్ల శ్రీనివాస్, అశోక్‌నగర్, కరీంనగర్**

అంతర్జాతీయ గుర్తింపు



సిరిసిల్లకు చెందిన ఫొటోగ్రాఫర్ మేర్గు చంద్రశేఖర్(ఎంసీ శేఖర్)కు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. దక్షిణాఫ్రికా పర్యాటక గిరిజనశాఖ, ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ డిలా ఆర్ట్ ఆఫ్ ఫొటోగ్రఫీలు సంయుక్తంగా నిర్వహించిన ప్రపంచస్థాయి పోటీల్లో శేఖర్ తీసిన 'హార్టీస్మైల్' బంగారు పతకం సాధించింది. అంతకుముందే శేఖర్ దశాబ్దకాలంగా గిరిజన జీవనశైలిపై, సామాజిక అంశాలపై ఫొటోలు తీసి పురస్కారాలు అందుకున్నారు. హైదరాబాద్ కేంద్రంగా సిగ్మా ఫొటోగ్రఫీ అకాడమీ స్థాపించారు. ఔత్సాహికులైన ఫొటోగ్రాఫర్లకు శిక్షణ ఇస్తున్నారు. ఇటీవల సాలర్‌జంగ్ మ్యూజియంలో రాష్ట్రస్థాయి ఫొటో వర్క్‌షాప్ నిర్వహించారు. ఎం.సీ.శేఖర్ తీసిన ఫొటోలకు 98 జాతీయ, అంతర్జాతీయ అవార్డులు దక్కాయి.

ఫొటోగ్రఫీలో రాణిస్తున్న పోలీస్


దాసరి మల్లేశ్ తీసిన ఫొటో


దాసరి మల్లేశ్

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్‌కు చెందిన దాసరి మల్లేశ్ కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. చిన్నప్పటి నుంచి ఫొటోగ్రఫీపై మక్కువ పెంచుకున్న మల్లేశ్ ఫొటోగ్రఫీలోని మెలకువలను నేర్చుకొని.. తీరక సమయంలో తన కళాభిరుచిని తీర్చుకుంటున్నారు. ఫొటో వర్క్‌షాపలలో పాల్గొని అద్భుత ఫొటోలు తీసి బహుమతులు అందుకున్నారు. పల్లె ప్రజల జీవన విధానం, సంస్కృతి సంప్రదాయాలపై తీసిన ఫొటోలకు ప్రశంసలు అందుకున్నారు. ఇటీవల జరిగిన జోనల్‌స్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌లో ఫొటోగ్రఫీ విభాగంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం చేతుల మీదుగా మూడో బహుమతి అందుకున్నారు.





రాజన్నకు శ్రావణ మొక్కులు

వేములవాడ: రాజన్నను సోమవారం 60 వే ల మంది భక్తులు దర్శించుకున్నారు. శ్రావణమాసం చివరి సోమవారం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రాకతో వ్యాపారాలు ఊపందుకున్నాయి. ట్రాఫిక్ పెరిగిపోవడంతో టౌన్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

చెరుకు రైతుకు రవాణా భారం

- ఫ్యాక్టరీ ప్రారంభం కాక అదనపు ఖర్చులు
- టన్నుకు రూ.700 వరకు భారం
- ఆదుకోవాలని రాష్ట్ర మంత్రులకు విన్నపాలు


చెరుకు పంట

జగిత్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఏకైక ముత్యంపేట చెరుకు ఫ్యాక్టరీని ప్రారంభించాలని రైతులు ఏళ్ల తరబడి కోరుతున్నా.. పాలకులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఐదేళ్లకోసారి ప్రభుత్వాలు మారుతున్నా.. చక్కెర ఫ్యాక్టరీ మాత్రం ప్రారంభం కావడం లేదన్నది ఇక్కడి రైతుల వేదన. దీంతో చెరుకు పంటపై మమకారం చంపుకోలేక.. రైతులు ఇతర జిల్లాలో ఉన్న ప్రైవేట్ చెరుకు ఫ్యాక్టరీతో ఒప్పందాలు చేసుకొని చెరుకును సాగు చేస్తున్నారు. ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ చక్కెర ఫ్యాక్టరీ సైతం చెరుకు రైతులకు అవసరమైన సదుపాయాలను కల్పించలేక నిర్లక్ష్యం చూపుతోంది. ఈ నేపథ్యంలో ముత్యంపేట చెరుకు ఫ్యాక్టరీని ప్రారంభించాలని, అప్పటివరకు చెరుకు రైతులపై పడే రవాణా భారాన్ని ప్రభుత్వం భరించాలని చెరుకు రైతులు ఇటీవల జగిత్యాలకు వచ్చిన మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందించారు.

1,500 ఎకరాల్లో సాగు

జిల్లాలో సాగునీటి వనరులు పుష్కలంగా ఉండడంతో.. ప్రస్తుతం చెరుకు పంటను దాదాపు 1,500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఒకప్పుడు 10వేల ఎకరాలకు పైగా చెరుకు పంట ఉన్నా.. ఫ్యాక్టరీ మూసేయడంతో విస్తీర్ణం తగ్గిపోయింది. గతంలో జిల్లాలో ఉన్న చెరుకు ఫ్యాక్టరీ ప్రభుత్వానిది కావడంతో.. పంట సాగు చేసే రైతులకు ఎరువులు, విత్తనం, కటింగ్, రవాణా వంటి వాటిపై ప్రోత్సాహకాలు అందించేది. ఇప్పుడు జిల్లాలో చెరుకు సాగు చేసే రైతులు కామారెడ్డి జిల్లాలో ఉన్న ప్రైవేట్ షుగర్ ఫ్యాక్టరీకి చెరుకును పంపిస్తుండడంతో.. రైతులకు ప్రోత్సాహకాలు ఇవ్వకపోగా, లేనిపోని నిబంధనలు పెట్టి జిల్లా రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

రవాణా భారం..

ప్రైవేట్ ఫ్యాక్టరీ ఎలాంటి సబ్సిడీలు ఇవ్వకపోయినా.. చెరుకు పంటపై ఆసక్తితో చెరుకును సాగు చేసిన రైతులకు రవాణా భారం పెద్ద సమస్యగా మారింది. జిల్లా నుంచి కామారెడ్డి చక్కెర ఫ్యాక్టరీ కనీసం 150 కి.మీ. వరకు ఉంటుంది. గతంలో ముత్యంపేట ఫ్యాక్టరీ వారు 15 కి.మీ. వ్యాసార్థంలో రవాణా భారం వేసేవారు కాదు. 15 కి.మీ. తర్వాత ఉన్న రైతులు ఎంతో కొంత మొత్తం చెల్లించేవారు. ఇప్పుడు జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో చెరుకు సాగు చేసేవారు కామారెడ్డికి లారీల్లో చెరుకు తరలించడం పెద్ద సమస్యగా మారింది. ప్రస్తుతం రైతులు చెరుకును కామారెడ్డి ప్రైవేట్ ఫ్యాక్టరీకి తరలించేందుకు టన్నుకు దాదాపు రూ.700 వరకు అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఇలా దాదాపు జిల్లా చెరుకు రైతులు రవాణా పేరిట రూ.4.50కోట్ల వరకు నష్టపోతున్నారు.

దిగుబడులు ఘనం.. వచ్చేది స్వల్పం

ఇక్కడి చెరుకు రైతులు అన్ని రకాల యాజమాన్య పద్ధతులు పాటించడంతో ఎకరాకు 40 టన్నుల వరకు దిగుబడి సాధిస్తున్నారు. ప్రస్తుతం చెరుకు టన్ను ధర రూ.3,470 వరకు ఉండగా, అందులో చెరుకు కటింగ్ కోసం కూలీలకు టన్నుకు రూ.860, రవాణా కోసం టన్నుకు రూ.700 వరకు ఖర్చు చేస్తున్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించుకోవచ్చు. పంటకు అవసరమైన రసాయన ఎరువులు, కలుపు వంటి వాటి కోసం మరింత ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో ఇతర ప్రాంతాలకు చెరుకు తరలించడం వల్ల రైతులకు పెద్దగా మిగిలింది ఏమీ లేదు.

ప్రభుత్వం భరించాలి



చెరుకు రైతులపై పడే రవాణా భారాన్ని ప్రభుత్వం భరించాలి. చెరుకు పండిస్తే మాకు ఆదాయం కాకుండా ఖర్చులు మిగులుతున్నాయి. త్వరగా ముత్యంపేట షుగర్ ఫ్యాక్టరీని ప్రారంభించి చెరుకు రైతులకు అండగా ఉండాలి. **– మామిడి మహేందర్‌రెడ్డి, తొంబరావుపేట, మేడిపల్లి**

మమకారం చంపుకోలేకే..



చెరుకు పంటపై మమకారం చంపుకోలేక సాగు చేస్తున్నాం. ఇక్కడ ఫ్యాక్టరీ ప్రారంభం కాకపోవడంతో కామారెడ్డికి తరలించాల్సి వస్తోంది. రవాణా భారం, కటింగ్ వంటి అనేక సమస్యలను ఎదుర్కొంటున్నాం. **– పీసు రాజేందర్‌రెడ్డి, మూడుబొమ్మల మేడిపల్లి, మెట్‌పల్లి**

బహిరంగ ప్రదేశంలో కోడె టికెట్లు ?

- ఉద్యోగుల తీరుపై అనుమానాలు

వేములవాడ: రాజన్న ఆలయంలో ప్రధాన మొక్కు అయిన కోడె టికెట్లు ఆలయం బయట ప్రదేశంలోకి రావడం కలకలం రేపాయి. కోడెమొక్కు చెల్లించే భక్తులు రూ.200 పెట్టి టికెట్ కొని కోడెతో ప్రదక్షిణ చేసి ప్రధాన ద్వారానికి ఎదురుగా కట్టేస్తారు. ఈక్రమంలో కోడె టికెట్లు పరిశీలించేందుకు రెండు చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. అక్కడ విధులు నిర్వర్తించే సిబ్బంది కోడె టికెట్లు తీసుకుని చించివేస్తారు. అయితే ఆ చించివేసిన టికెట్లు సోమవారం ఆలయంలోని స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌పై దర్శనమిచ్చాయి. ఇక్కడి ఎలా వచ్చాయని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఆలయ ఉద్యోగులే రీసైక్లింగ్ చేస్తూ డబ్బులు దండుకునేందుకు ఇలా తెచ్చి ఉంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఈవో రాధాభాయి మాట్లాడుతూ గతంలో ఈ టికెట్లను ఓపెన్‌స్లాబ్‌పై వేసి ఉంటారని, ఇక్కడ విధులు నిర్వహించే సిబ్బందిని విచారించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఇసుక వివాదం..

- ట్రాక్టర్లలో ఇసుక తరలిస్తుండగా గ్రామస్తుల మధ్య వాగ్వాదం
- నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు
- విచారణ చేపట్టిన మెట్‌పల్లి డీఎస్పీ రాములు

మెట్‌పల్లి రూరల్: ఇసుక విషయమై జరిగిన వివాదంపై మెట్‌పల్లి పోలీసులు నలుగురిపై అట్రాసిటీ కేసు నమోదు చేశారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ గోదాంలో ఈనెల 10న అగ్నిప్రమాదం చోటుచేసుకున్న విషయం తెల్సిందే. ప్రమాదంలో పెద్ద ఎత్తున మంటలు చెలరేగగా.. అగ్నిమాపక శాఖ అధికారులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినా రెండు రోజులైనా అదుపులోకి రాలేదు. యార్డులో గన్నీసంచులు కాలుతుండగా వాటిపై ఇసుక పోసి మంటలు ఆర్పాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఆత్మకూర్ పెద్దవాగు నుంచి ఈనెల 12న ట్రాక్టర్లలో ఇసుక తరలించారు. ఆ సమయంలో పలువురు ట్రాక్టర్లను అడ్డుకుని వివాదం చేశారు. అక్కడే ఉన్న తనను కులం పేరుతో దూషిస్తూ దుర్భషలాడారని వీడీసీ చైర్మన్ రమేశ్ మెట్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నలుగురిపై ఫిర్యాదు చేశాడు. దీంతో గ్రామానికి చెందిన తాటిపెల్లి సురేశ్‌రెడ్డి, తిప్పిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కేశిరెడ్డి నవీన్‌రెడ్డి, శోభపై పోలీసులు అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ మేరకు మెట్‌పల్లి డీఎస్పీ రాములు సోమవారం ఆత్మకూర్‌కు వెళ్లి విచారణ జరిపారు. ఆయన వెంట మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ ఉన్నారు.

నిండుకుండలా ఎగువమానేరు


ఎగువమానేరు ప్రాజెక్టు

గంభీరావుపేట(సిరిసిల్ల): గంభీరావుపేట మండలం నర్మాల ఎగువమానేరు ప్రాజెక్టు నిండుకుండలా మా రింది. ఎగువ ప్రాంతాలైన కామారెడ్డి జిల్లా పాల్వంచ వాగు, సిద్దిపేట జిల్లా కూడవెల్లి వా గుల ద్వారా వరద నీరు జలాశయంలోకి చేరుతోంది. దీంతో ప్రాజెక్టులో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం రెండు టీఎంసీలు(31అడుగులు) కాగా.. ప్రస్తుతం 1.61టీఎంసీలు (29అడుగులు) నీటి మట్టం ఉంది. దాదాపు 1,080 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఇదే వరద కొనసాగితే ఒకటి, రెండు రోజుల్లో ప్రాజెక్టు పరవళ్లు తొక్కే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో పరీవాహక వాగు ప్రాంత రైతులు, పశువుల, గొర్రెల కాపరులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ మారుతిరెడ్డి సూచించారు. వాగుల వద్దకు చేపల వేటకు ఎవరు వెళ్లవద్దని హెచ్చరించారు.